సాక్షి
ప్రకాశం
సోమవారం ׀ 14 ׀ ఏప్రిల్ ׀ 2025

గాలివాన బీభత్సం



జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో, ఈదురుగాలులతో వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- 8లో..



రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా నలుగురికి గాయాలయ్యాయి. పెద్దారవీడు మండలంలో ఆదివారం ఈ ఘటన జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
38/25

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ పి.చెంచురామయ్య

ఒంగోలు సిటీ: ఒంగోలు ఏకేవీకే కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో 65 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. ఏకేవీకే కాలేజీలో ఆదివారం ఫాక్స్‌కాన్, బ్లింకిట్, ఫ్లిప్‌కార్ట్ వంటి కంపెనీలతో జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు వివిధ కళాశాలల నుంచి 65 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 52 మందికి కాల్ లెటర్లు అందజేసినట్లు తెలిపారు. వీరికి భోజన వసతితో పాటు కనీస వేతనం రూ.20 వేలు వరకు ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థుల నైపుణ్యం ద్వారా మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. తమ విద్యార్థులు కాలేజీలో క్యాంపస్ ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగం కల్పించినందుకు కళాశాల కరస్పాండెంట్ పి.చెంచురామయ్య కంపెనీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ప్రిన్సిపాల్ రామిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కంపెనీలను తమ క్యాంపస్‌కు పిలిచి తమ విద్యార్థులకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏకేవీకే కాలేజీ కరస్పాండెంట్ పి.చెంచురామయ్య, ప్రెసిడెంట్ మండవ నాగేశ్వరరావు, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ కోటేశ్వరరావు, కామర్స్ లెక్చరర్ పున్నయ్య, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కారు జాగా.. కూటమి పాగా

కూటమి నేతలు రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములపై కన్నేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని అప్పనంగా కాజేసేందుకు రంగం సిద్ధం చేశారు. కలెక్టర్ నివాసానికి కూతవేటు దూరంలోని రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారు. ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు సిద్ధమైపోయారు. ఇంత జరుగుతున్నా ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు.



కేశవరాజుకుంట వద్ద టీడీపీ నాయకులు సుమారు 6 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఏర్పాటు చేసిన కంచె

- రూ.కోట్ల విలువైన భూమిని కొట్టేస్తున్న కూటమి వర్గీయులు
- కేశవరాజుకుంట ఎదురుగా 5.60 ఎకరాల ఆక్రమణకు రంగం సిద్ధం
- అక్కడ ఎకరా రూ.6 కోట్లు
- మొత్తం రూ.36 కోట్ల ప్రభుత్వ స్థలం
- ప్రభుత్వ భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్న టీడీపీ నేతలు
- సర్వే నంబరు-81లో మరో 1.36 ఎకరాల దురాక్రమణ
- యథేచ్ఛగా రాళ్లుపాతి ప్లాట్లు వేసుకుంటున్న టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు కూటమి నేతలు గద్దల్లా వాలిపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎక్కడికక్కడ కబ్జా చేసి ప్లాట్లుగా వేసి అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. ఒంగోలు నగరంలోని ముక్తినూతలపాడు పంచాయతీ సర్వే నంబర్ 15లో 21 ఎకరాల 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. రికార్డుల్లో కుంట భూమిగానే ఉంది. అందులో 5.60 ఎకరాల భూమికి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఒంగోలు నగరం కమ్మపాలేనికి చెందిన టీడీపీ నేత, ముక్తినూతలపాడుకు చెందిన టీడీపీ నేత కలిసి కబ్జా చేశారు. గతంలో జాన్ ప్రభాకర్ అనే వ్యక్తి ఈ భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్లాట్లు కింద ఇవ్వాలని హైకోర్టులో కేసు వేశారు. కొంతమంది ఈ ప్రభుత్వ భూమిలో 5 ఎకరాల 60 సెంట్లను ఎమ్మార్వో ఆఫీస్ నుంచి ఎన్‌ఓసీ లేకుండా అమ్మకాలు జరిగినట్లు సమాచారం. సరైన ధ్రువపత్రాలు లేకుండానే రిజిస్ట్రేషన్ చేశారు. హైకోర్టు పరిధిలో పెండింగ్ ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ భూమి విలువ ప్రస్తుత మార్కెట్‌లో గది రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఉంది. అంటే ఎకరా రూ.6 కోట్లు లెక్కన వేసుకున్నా సుమారు 6 ఎకరాలు రూ.36 కోట్లు పలుకుతుంది. ఇంత విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.



అగ్రహారం రోడ్ లోని దత్తాత్రేయ కాలనీ వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె వేసిన టీడీపీ, జనసేన నాయకులు

రూ.5 కోట్ల స్థలానికి ఎసరు...

అగ్రహారం రైల్వే గేటు దాటగానే బాలాజీ నగర్ తరువాత దత్తాత్రేయ కాలనీ వస్తుంది. ఆ కాలనీకి ఎదురుగా ప్రభుత్వానికి చెందిన 1.36 ఎకరాల అసైన్‌మెంట్ భూమి ఉంది. ప్రభుత్వానికి చెందిన అసైన్‌మెంట్ స్థలం కాబట్టి ప్రస్తుత మార్కెట్లో ఒక్కో గది రూ.55 వేల నుంచి రూ.70 వేల వరకు ఉంది. అంటే దాదాపు 816 గదుల స్థలం అది. సరాసరిన ఒక్కో గది రూ.60 వేలు వేసుకున్నా దాని విలువ సుమారుగా రూ.5 కోట్లు. ఇంత ఖరీదైన ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి మూడు, నాలుగు రోజులుగా ప్లాట్లు వేసుకొని ఏకంగా పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపడుతున్నారంటే ఎంతగా బరితెగించారో అర్థమవుతోంది.

టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పుడల్లా ఈ స్థలంపై కన్ను..



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా సర్వే నంబరు-81 కబ్జా చేసి గుడిసెలు వేశారు. అయితే అప్పట్లో ఒంగోలు తహశీల్దార్ చిరంజీవి రంగంలోకి దిగి అక్రమంగా వేసిన గుడిసెలను పూర్తిగా తొలగించి ఇది ప్రభుత్వ భూమి అని బోర్డు కూడా పెట్టారు. ఆ తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఎవరూ ఆ స్థలం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం రాగానే తెలుగు తమ్ముళ్ల కళ్లు ఆ ఖరీదైన స్థలంపై పడ్డాయి. ఇంకేముంది అనుకున్నదే తడవుగా జాగా కనపడింది...పాగా వేసేశారు..కోట్లు లెక్క జేబుల్లో నింపుకుంటున్నారు. భూ ఆక్రమణలపై స్థానిక తహశీల్దార్ వాసు వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కేశవరాజుకుంట వీఆర్వో సురేష్ వివరణ కోరగా కుంట స్థలం ఆక్రమణ వ్యవహారాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లానని, ఆయన పరిశీలిస్తున్నారని చెప్పారు.

ప్లాట్లు చేసి యథేచ్ఛగా అమ్ముకుంటున్న టీడీపీ, జనసేన నేతలు

ఒంగోలు నగరపాలక సంస్థలోని 16వ డివిజన్‌కు చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు నగరానికి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి చెప్పాడని చెప్పి నేరుగా ప్లాట్లు వేసుకున్నారు. కనీసం రెవెన్యూ అధికారులు కానీ, మండల సర్వేయర్ కానీ, ఒంగోలు నగర పాలక సంస్థ సర్వేయర్ కానీ ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. స్థానికంగా ఉన్న టీడీపీ డివిజన్ నాయకుడు, మరికొందరు స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ప్లాట్లుగా వేసుకొని రూ.కోట్లకు అమ్ముకుంటున్నారు. మామిడిపాలేనికి చెందిన ఒక పాస్టర్‌కు 50 గదులు ఒక్కో గది రూ.60 వేల చొప్పున అమ్మారు. దాంతో పాస్టర్ ఆగమేఘాల మీద పిల్లరు బాక్సులు తెప్పించి ఏకంగా స్థలం చుట్టూ ప్రహరీ కోసం పిల్లర్లు కూడా వేశారు. ఆ పిల్లర్ల మధ్యలో పునాదులు తీసి ప్రహరీ నిర్మించటమే తరువాయి.

జగనన్నకు అండగా జనం



వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ



వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభ వద్ద వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

- 2029లో వచ్చేది జగనన్న ప్రభుత్వమే
- చంద్రబాబుని నమ్మి మోసపోయిన ప్రజలు
- జిల్లాలో ప్రతి కార్యకర్తకు అండగా బూచేపల్లి కుటుంబం
- రామతీర్థం తిరునాళ్లలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, ఆరె శ్యామల

చీమకుర్తి రూరల్: జగనన్నకు అండగా జనం ఉన్నారని, 2029లో అధికారంలోకి వచ్చేది మన ప్రభుత్వమే అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. చీమకుర్తి మండలం రామతీర్థంలోని గంగా బాలత్రిపుర సుందరీ సమేత మోక్ష రామలింగేశ్వరస్వామి దేవస్థానం పుణ్యక్షేత్రంలోని గంగమ్మ తల్లి తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తరఫున విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. ఈ ప్రభపై బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, ఆరె శ్యామల నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 2029లో జగనన్నను సీఎం చేసే వరకు ప్రతి కార్యకర్త పనిచేయాలని, వారికి బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుందని అన్నారు. సంతనూతలపాడు సమన్వయకర్త మేరుగు నాగార్జున మాట్లాడుతూ సూపర్‌సిక్స్ అని మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తోందని విమర్శించారు.



యోగివేమన రెడ్డి సత్రంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను సన్మానిస్తున్న నిర్వాహకులు

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ 2029 వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడుతుందని జగనన్నను సీఎం కాకుండా ఎవ్వరూ ఆపలేరన్నారు. జగనన్న సీఎం అయితేనే ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మాట తప్పిన వారికి ప్రజలు బుద్ధి చెప్తారని, నిజం చెప్పే నాయకులు ఈ రాష్ట్రానికి అవసరం అన్నారు. 2029లో జగనన్న ను మనం మళ్లీ ముఖ్యమంత్రిగా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రభపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి, యాంకర్ అనన్య సందడి చేసింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు, పట్టణపార్టీ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, దుంపా చెంచిరెడ్డి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, ఓబులరెడ్డి, చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, మారం శ్రీనివాసరెడ్డి, పాటిబండ్ల గంగయ్య, జీ ప్రసాదరెడ్డి, సోమా శేషాద్రి, చంద్ర, సాదినేని వెంకటరావు, మన్నం వెంకటరావు, ఏలూరు సురేష్, కత్తి రమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..రంగనాయకుని కల్యాణం



మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితులు



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

- భక్తజనంతో కిక్కిరిసిన నెమలిగుండ్ల క్షేత్రం

రాచర్ల: రంగనాయకా..పాహిమాం అంటూ భక్తజనం పులకించిపోయారు. వేదమంత్రాల సాక్షిగా మంగళ వాయిద్యాల నడుమ నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం అంగరంగ వైభోవంగా నిర్వహించారు. రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఆదివారం నెమలిగుండ్ల రంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, పుష్పలీల దంపతులు, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం సమన్వయకర్త అన్నా వెంకట రాంబాబు, దుర్గాకుమారి దంపతులతో పాటు దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య, దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, అన్నవరం సత్యనారాయణచార్యులు, వెంకటరంగచార్యులు కల్యాణం నిర్వహించారు. కళ్యాణ వ్యాఖ్యాతగా హయగ్రీవాచార్యులు వ్యవహరించారు. రాచర్ల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డితో పాటు 40 మంది దంపతులు కల్యాణ పీటలపై కూర్చున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాగిమాను ప్రతాప్ కుమార్, అన్నరంగప్రసాద్ దంపతులు స్వామి వారికి ముత్యాల తలంబ్రాలను అందజేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య, రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు తలంబ్రాలతో పాటు స్వామివారి తీర్థప్రసాదాన్ని పంచిపెట్టారు. బ్రహ్మోత్సవాలకు వచ్చిన వందలాది భక్తులకు కాశీనాయనరెడ్ల, యోగివేమన రెడ్ల, గోపాలకృష్ణయాదవ, కృష్ణదేవరాయుల కాపు బలిజ, మేదర, ఆర్యవైశ్య, అన్నసత్రాల్లో అన్నసంతర్పణ చేశారు.

ఘనంగా సీతారాముల ఆలయ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, శ్యామల

- పాల్గొన్న చెవిరెడ్డి, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ

తాళ్లూరు: మండలంలోని విఠలాపురం గ్రామంలో సీతారాముల గుడి ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరామ భక్త బృందం ఘనంగా నిర్వహించారు. శిలా నిర్మిత నూతన ఆలయంలో సీతా లక్ష్మణ హనుమంత సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట మండల అధ్యక్షుడు తూము సుబ్బారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పోశం మధుసూదన్ రెడ్డి, ఐవీ సుబ్బారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచులు కోట శివలక్ష్మి, వెంకటరామిరెడ్డితో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

కమనీయం..చెన్నకేశవుని కల్యాణం

మార్కాపురం టౌన్: లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కల్యాణం ఆదివారం వేకువజామున లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో కమనీయంగా నిర్వహించారు. సోమవారం రాత్రి సూర్య వాహనంపై పెళ్లి కుమారుడై శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి వారు భేరీ మండపంలో ఉండగా, అర్చకస్వాములు భేరీ పూజలు నిర్వహించారు. రాయబారం, ఎదుర్కోల వైభవంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఎదురుకోల అనంతరం అమ్మవారి తరఫున ఆనవాయితీ ప్రకారం మండలంలోని వేములకోటకు చెందిన ఆమంచి చంద్రశేఖర్, మోహన్‌లు స్వామి వారికి తలంబ్రాలు, బియ్యం, తాళిబొట్లు, కంకణం, భటువు, కళ్యాణ వస్త్రాలను సమర్పించారు.



కల్యాణానికి హాజరైన భక్తులు



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దంపతులు

అర్చకస్వాములు, వేదపండితులు, వేదమంత్రోచ్చారణతో, మంగళవాయిద్యాలు మోగుతుండగా స్వామి వారి కల్యాణాన్ని ప్రత్యేక వ్యాఖ్యానంతో పాంచరాత్ర ఆగమంగా ప్రారంభించారు. ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనచార్యులు, యాజ్ఞీకులు సోమయాజుల మల్లికార్జునశర్మలు శ్రీస్వామి వారి పరిణయ ఘట్టాన్ని కమనీయంగా నిర్వహిచారు. కళ్యాణాన్ని తిలకించేందుకు తెల్లవారుజాము నుంచే వేలాది మంది భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం పోటెత్తింది. కళ్యాణానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, మేడా బద్రీనాథ్, పీ.కేశవరావు, వై.కాశీవిశ్వనాథ్, కె.రామిరెడ్డి దంపతులతో పాటు సూర్య వాహనం ఉభయదాతలుగా తంగిరాల నాగజగన్నాథ్, కళ్యాణ మండపానికి శాశ్వత పుష్పలంకరణ ఉభయదాతలు మున్సిపల్ వైస్ చైర్మన్ సీహెచ్ అంజమ్మ శ్రీనివాసులు, కుమ్మరి కాశయ్య, మోహన్‌రావు, పలువురు పురప్రముఖులు, అధికారులు పాల్గొని స్వామి వారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి వారికి ముత్యాల తలంబ్రాలను నాదెళ్ల సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, భద్రత ఏర్పాట్లను డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణ పోలీసులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

గరల్స్ హాస్టల్.. హైస్కూల్‌లో వద్దు

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: గరల్స్ హాస్టల్ భవన నిర్మాణాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం సరైంది కాదని, రెవెన్యూ అధికారులతో సంప్రదించి మరో ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో భవన నిర్మాణాలు చేపట్టడం బాలికలకు శ్రేయస్కరమని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన కలెక్టర్ తమీమ్ అన్సారియా, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్‌లకు అర్జీ పంపారు. డీడీతో ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ ప్రభుత్వ హైస్కూల్‌లో కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినుల కోసం హాస్టల్ భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేస్తున్నారని, అక్కడ భవనాలు నిర్మిస్తే హైస్కూల్ విద్యార్థులకు ప్లే గ్రౌండ్ లేకుండా పోతుందని, అంతేకాకుండా హాస్టల్‌లో ఉండే విద్యార్థినులు అసౌకర్యాలకు గురవుతారని అన్నారు. పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని, రెవెన్యూ అధికారులతో సంప్రదిస్తే తమకు కావాల్సినంత స్థలం వారు కేటాయించగలరని తెలిపారు. మార్కాపురం రోడ్డులో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ కూలే దశలో ఉందని, శిథిల భవనాలు పూర్తిగా తొలగించి కళాశాల విద్యార్థినులను దృష్టిలో పెట్టుకొని నూతన హంగులతో భవనాలు నిర్మిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని ఆయన సూచించారు. స్థానిక అధికారులు తమ ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకోవడం శోచనీయమని అన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

ఒంగోలు టౌన్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికను తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని కోరారు.

క్లుప్తంగా

మనోవేదనతో వివాహిత ఆత్మహత్య

ఒంగోలు టౌన్: భర్తతో మనస్పర్థలు వచ్చి దూరంగా ఉంటున్న ఒక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మరణించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరంలోని సీతారామపురానికి చెందిన అనూషకు, రైల్వే స్టేషన్ రోడ్డులోని హరికుమార్ కు కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొద్ది రోజులుగా వేరువేరుగా ఉంటున్నారు. వీరిద్దరి విడాకుల కేసు కోర్టులో నడుస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం అనూష తల్లి వద్ద ఉంటోంది. ఇంట్లో ఎవరికీ తెలియకుండా ఈ నెల 6వ తేదీ అనూష ఎలుకల మందు తీసుకొంది. అయితే తల్లికి కూడా చెప్పలేదు. నీరసంగా ఉండడంతో తల్లి శ్రీమంతుల పద్మ అనుమానం వచ్చి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించింది. పరీక్షలు చేసిన వైద్యుడు అనూష ఎలుకల మందు తిన్నట్లు నిర్ధారించారు. అప్పటికే ఆమె ఆరోగ్యం క్షీణించడంతో జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందింది. తల్లి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఒంగోలు టౌన్: జిల్లాలోని కరువు మండలాల్లో సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో చేసిన తీర్మానాలను ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు విడుదల చేశారు. జిల్లాలో వేసవి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని, తాగునీటి కొరత ఉన్న గ్రామాలు, పట్టణాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. తాగునీటి పథకాలను నీటి సరఫరా చేయడానికి ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలు, కనిగిరి, దర్శి, గిద్దలూరు, చీమకుర్తి, పొదిలి పట్టణాల్లో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన నిధులను కేటాయించాలని, జల్‌జీవన్ ద్వారా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జీవి కొండారెడ్డి, సయ్యద్ హనీఫ్, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి. సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా విడుదల

ఒంగోలు వన్‌టౌన్: ఉపాధ్యాయుల సీనియార్టీ 2వ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ వరకు సీనియారిటీ జాబితాను సబ్జెక్టు వారీగా, స్కూల్ అసిస్టెంట్ నుంచి ప్రధానోపాధ్యాయులు సీనియారిటి లిస్టును వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ జాబితాలో కూడా ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 16వ తేదీ లోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు. అభ్యంతరాలు తెలిపే వారు అభ్యంతరం చేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, సీనియారిటి జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలన్నారు. ఆధారాలు, లేదా సంబంధిత సాక్ష్యాలు ఉంటే జత చేయాలని, సంబంధిత అధికారితో ధృవీకరణ చేయించాలన్నారు. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిగణలోనికి తీసుకోమన్నారు. ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


గనివానిపాడులో వర్షం ధాటికి తడిసిన పొగాకు బేళ్లు


గనివానిపాడులో ఎగిరిపోయిన రేకులు

గాలివాన బీభత్సం

- కనిగిరిలో వడగండ్ల వాన
- కూలిన విద్యుత్ స్తంభాలు
- ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు
- కనిగిరిలో ప్రహరీ కూలి మహిళ మృతి


సూరాపాపిరెడ్డి కాలనీలో ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించాయి. సాయంత్రం వరకు భానుడి ఉగ్రరూపం చూపగా..ఒక్కసారిగా వాతావరణం చల్లబడి పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన కురవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. జిల్లాలో కనిగిరి, కొండపి, దర్శి, మార్కాపురం నియోజకవర్గాల్లో గాలివాన ప్రభావం ఎక్కువగా ఉంది.

- కనిగిరి మండలం శంఖవరానికి చెందిన డబ్బుకొట్టు లక్ష్మమ్మ(52) పశుగ్రాసం కోసం వెళుతుండగా ఒక్కసారిగా గాలివాన రావడంతో మార్గమధ్యంలో సైయింట్ జోసఫ్ స్కూల్ వెనుక నిర్మాణంలో ఇంటి ప్రహరి గోడ వద్ద నిలబడింది. రెండ్రోజుల క్రితమే సిమెంట్ బ్రిక్స్‌తో కట్టిన గోడ కావడంతో జోరు గాలికి గోడ కూలి ఆమెపై పడటంతో తీవ్ర రక్తస్రావమైంది. ఇరుగుపొరుగు వారు గమనించే సరికి ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై టి.శ్రీరాం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పొదిలి రోడ్డులో రేకుల ఇళ్లు పైకప్పు పూర్తిగా ఎగిరిపోయింది. జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద విద్యుత్ స్తంభం కూలిపోయింది. కనిగిరిలో అనేక ప్రాంతాల్లో చెట్లు, కొమ్మలు విరిగి రోడ్లపై పడ్డాయి. భారీ వర్షం కురవడంతో ప్రజలు కాస్త ఇబ్బందిపడ్డారు. భారీ వర్షానికి కొన్ని ప్రాంతాల్లో పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది.
- పీసీపల్లి మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. వర్షానికి కల్లాలపై ఉన్న మిరపకాయలు తడిసి ముద్దయ్యాయి. ఈదురుగాలుల దెబ్బకు పొగాకు బ్యార్న్‌ల రేకులు లేచిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కమ్మవారిపల్లెకు చెందిన వంకాయలపాటి రమేష్, నరసింహారావు బ్యార్న్‌ల రేకులపై లేచిపోవడంతో క్యూరింగ్‌లో ఉన్న పొగాకు తడిచిపోయింది. ఈదురుగాలులకు చెట్లు నేలకొరిగి విద్యుత్ వైర్లు తెగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


కనిగిరిలో పడిన వడగండ్లు


కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద కూలిన విద్యుత్ స్తంభం

- పొన్నలూరు మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన బలమైన గాలులు వీయడంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. పొన్నలూరు, వెల్లటూరు, వెంకుపాలెం, విప్పగుంట గ్రామాల్లో ఈదురుగాలుల దాటికి పొగాకు బ్యారన్ల పైకప్పు రేకులు చెల్లా చెదురుగా పడిపోయాయి. పొన్నలూరు రెవెన్యూ కార్యాలయం, నివాస గృహాల మధ్య చెట్లు విరిగి పడిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో చెట్లు విరిగి నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.
- దర్శిలో నాలుగు రోజుల వ్యవధిలో మరోసారి గాలివాన బీభత్సం సృష్టించింది. నాలుగు రోజుల క్రితం గాలివానకు బొప్పాయి తోటలు నేలకొరగడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. తిరిగి ఆదివారం కూడా ఈదురుగాలుల ధాటికి ఇంటి పైకప్పు రేకులు లేచిపోయాయి. చెట్లు విరిగిపడ్డాయి. మిరప, పొగాకు రైతులు పట్టలు కప్పి పంటలను రక్షించుకున్నారు.
- మద్దిపాడు మండలంలో గాలివాన బీభత్సానికి జువ్విగుంట, తంగెళ్ల, దుగ్గిరెడ్డిపాలెం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దుగ్గిరెడ్డిపాలెం, మద్దిపాడు, గార్లపేట, తంగెళ్ల, జువ్విగుంట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కల్లాల్లో ఉన్న మిరపకాయలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.
- మార్కాపురం పరిసర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో కల్లాల్లో ఉన్న మిరప రైతులు ఆందోళన చెందారు. వేములకోట, కొట్టాలపల్లి, కోలభీమునిపాడు, తిప్పాయిపాలెం, ఎల్‌బియస్ నగర్, జమ్మనపల్లి, మిట్టమీదిపల్లి, నికరంపల్లి తదితర గ్రామాల్లో పొలాల్లో ఉన్న మిర్చి వర్షానికి తడిసిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మిర్చి చివరి కోత కోసి గ్రేడింగ్ కోసం రైతులు కళ్లాల్లోనే ఉంచారు. అసలే ధరలు లేకపోవడంతో అల్లాడుతుంటే ఇప్పుడు అకాల వర్షంతో తడిసి కాయలు పాడైపోయే పరిస్థితి నెలకొందని వాపోయారు. గాలివానకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించారు.
- కొనకనమిట్ల మండలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గనివానిపాడులో గాలివానకు రేకులు లేచిపోవడంతో అందులో ఉన్న పొగాకు బేళ్లు తడిసిపోయాయి. పలు ప్రాంతాల్లో అరటి, బొప్పాయి తోటలకు ఈ వర్షంతో నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోయారు.
- పొదిలి మండలం కుంచేపల్లి పంచాయతీ ఉన్నగురవాయపాలెం బస్టాండ్ సెంటర్‌లో గాలివానకు పెద్ద వేప చెట్టు పడిపోయింది. చెట్టు నడిరోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్టు పడే సమయంలో ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.


గోడ కూలి మృతి చెందిన మహిళారైతు డబ్బుకొట్టు లక్ష్మమ్మ, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై టీ శ్రీరాం


మార్కాపురం కల్లాల్లో ఉన్న మిర్చిపై కప్పిన పట్ట


మార్కాపురం కల్లాల్లో ఉన్న మిర్చిపై కప్పిన పట్ట


చెల్లాచెదురుగా పడిన బ్యార్న్ పై కప్పు రేకులు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


అల్లు మహేశ్వరరెడ్డి మృతదేహం

పెద్దారవీడు: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్రవాహనాలు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా..నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో పుచ్చకాయలపల్లి, పెద్దారవీడు గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దారవీడులో నాగులమీరాస్వామి ఉరుసు సందర్భంగా అల్లు మహేశ్వరరెడ్డి, అల్లు ఈశ్వరరెడ్డి కలిసి ద్విచక్ర వాహనంపై పుచ్చకాయలపల్లిలో ఉన్న మేనత్త పోతిరెడ్డి నారాయణమ్మను తీసుకువచ్చేందుకు వెళ్లారు. పుచ్చకాయలపల్లి గ్రామం నుంచి మహేశ్వరరెడ్డి, ఈశ్వరరెడ్డి మేనత్త పోతిరెడ్డి నారాయణమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై పెద్దారవీడు గ్రామానికి బయలుదేరారు. సుంకేసుల గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు పెద్దారవీడులో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి పెద్దారవీడు నుంచి ద్విచక్ర వాహనంపై సొంత గ్రామానికి బయలుదేరగా పుచ్చకాయలపల్లి గ్రామం సమీపంలో మంగళికుంట వద్దకు రాగానే రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టడంతో మహేశ్వరరెడ్డికి తలకు, ఈశ్వరరెడ్డి, నారాయణమ్మ, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు వెంటనే మార్కాపురం జీజీహెచ్ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహేశ్వరరెడ్డి(15)ని ఒంగోలు జీజీ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో తరలించారు. మార్గమధ్యలో పొదిలి పట్టణానికి సమీపంలో మృతి చెందాడు. నారాయణమ్మ, ఈశ్వరరెడ్డిలను మెరుగైన వైద్యం నిమిత్తం నరసరావుపేటకు తరలించారు. మహేశ్వరరెడ్డి రాజంపల్లి సమీపంలో కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదివి ఇటీవల పబ్లిక్ పరీక్షలు రాశారు. ఉరుసు పండుగ సందర్భంగా మహేశ్వరరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. తల్లిదండ్రులు, బంధవులు కన్నీరు మున్నీరయ్యారు.

అదుపు తప్పి కారు బోల్తా


గాయపడ్డ లక్ష్మిని ఒంగోలు తరలిస్తున్న దృశ్యం


సంఘటనా స్థలంలో బోల్తాపడి ఉన్న కారు

- నలుగురికి గాయాలు

కంభం: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాపడటంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం స్థానిక అనంతపురం- అమరావతి హైవే రోడ్డుపై జరిగింది. వివరాల్లోకి వెళితే..కర్ణాటక రాష్ట్రం చిక్లాపూర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో శ్రీశైలం వెళ్లి దర్శనం చేసుకున్న అనంతరం తిరిగి కర్ణాటకకు వెళ్తుండగా కంభం- జంగంగుంట్ల మధ్యలో హైవే రోడ్డుపై అదుపుతప్పి పంటపొలాల్లో బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ఉన్న పవన్, రామచంద్రపవన్, లక్ష్మి, విద్య, షాను, సిద్ధిరాజు ఉండగా వీరిలో ఇద్దరికి స్వల్పగాయాలు, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుల్లో కొందరిని ప్రభుత్వ వైద్యశాలకు, మరికొందరి ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వీరిలో లక్ష్మి అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు.

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు..!

- భార్యపై రోకలిబండతో దాడి చేసి హత్య
- అనుమానంతో భార్యకు నిత్యం వేధింపులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

పామూరు: కట్టుకున్నోడే ఆమె పాలిట కాలయముడయ్యాడు. భార్యపై అనుమానంతో నిద్రిస్తున్న సమయంలో రోకలిబండతో విచక్షణా రహితంగా దాడి చేసి హత్య చేసి పరారయ్యాడు. ఈ సంఘటన పామూరులో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం...స్థానిక ప్రశాంతినగర్‌లో యాసారపు రమేష్ బేల్దారీ పనులు చేసుకుంటూ భార్య మార్తమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలిసి జీవిస్తున్నారు. రమేష్ బేల్దారీ పనులు చేస్తుండగా, మార్తమ్మ ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. మార్తమ్మపై భర్త రమేష్‌కు అనుమానం. దీంతో ఆమెపై ద్వేషం పెంచుకొని నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం మార్తమ్మ నిద్రిస్తున్న సమయంలో భర్త రమేష్ రోకలిబండంతో విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యాడు. సమీపంలోని వారు గమనించి క్షతగాత్రురాలు మార్తమ్మను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించగా..అప్పటికే మార్తమ్మ(30) మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్, కనిగిరి సీఐ షేక్.ఖాజావలి పరిశీలించారు. ఘటనపై ఎస్సై టి.కిషోర్‌బాబుతో మాట్లాడి వివరాలు సేకరించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ ఖాజావలి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. నిందితుడు పరారీలో ఉండగా పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

గంగమ్మ తిరునాళ్లకు వేళాయే

- జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా గంగమ్మ తల్లి దేవస్థానం
- తిరునాళ్లకు పలు జిల్లాల నుంచి భారీగా తరలిరానున్న భక్తులు
- భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్న పోలీసులు
- ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి


తిరునాళ్లకు సిద్ధమైన గంగమ్మ తల్లి దేవస్థానం

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన తిరునాళ్లలో గంగమ్మ తిరునాళ్ల ఒకటి . గుంటి గంగా భవానీ అమ్మవారి జాతరను ఏటా చైత్రమాస బహుళ విదియ నాడు వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది గంగమ్మ జాతర 100వ వార్షిక సందర్భంగా ఈ నెల 14న సోమవారం అంగరంగా వైభవంగా నిర్వహించేలా ఆలయ అధికారులు సర్వం సిద్ధం చేశారు. తిరునాళ్లకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

ఇది తిరునాళ్ల చరిత్ర..

గంగా భవానీ ఆలయం 12వ శతాబ్దం కాలం నాటిది. కాటంరాజు కాలంలో నిర్మించిన గంగమ్మ దేవాలయాల్లో ఇది ఒకటి. ఈ గుడికి దక్షణం వైపు కొండపాడు వద్ద రాతిగుండు కిందుగా నీరు ప్రవహిస్తుండటంతో దీనిని గుండు గంగగా పిలిచేవారు. ఏడాది పొడవునా ప్రవహించే గంగా జల ఆధారంగా చుట్టుపక్కల గ్రామాల రైతులు పంటలు పండించేవారు. ఈ జల గంగమ్మ తల్లి వరప్రసాదంగా భావించి ఏటా తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జలధారపైన ఉన్న గుండును తొలగిస్తే ఇంకా నీటి ప్రవాహం పెద్దదవుతుందని భావించిన రైతులు దానిని పక్కకు తొలగించారు. దీంతో అక్కడ గుంత ఏర్పడింది. కానీ నీరు మాత్రం పెరగలేదు. అప్పటి నుంచి గుంటి గంగగా మారింది. ఈ క్షేత్రాన్ని దక్షిణ కాశీగా కూడా పిలుస్తారు. పూర్వం మునులు తపస్సు చేసి గుంటిగంగలో స్నానమాచరించి శివాలయంలో పూజలు చేసేవారు. ఈ ప్రాంతాలు మునులు జపిస్తున్న మంత్రాలు వినిపిస్తూ ఉండేవని, అందువల్ల ఈ ప్రాంతాన్ని స్వాములవారి ధ్వని అని పిలిచేవారని పెద్దలు చెబుతుంటారు. దశాబ్దం క్రితం గంగమ్మ శివాలయాలను పునరుద్ధరించారు. ఈ ప్రాంగణంలోనే కృష్ణాలయం, నాగదేవత పుట్టశిలలు, పార్వతీ సమేత మల్లికార్జునస్వామి, అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ప్రసిద్ధ గాంచిన దేవాలయాలు, కాశీ నాయన ఆశ్రమం ఉన్నవి. పూర్వం ఈ ఆలయం కొండకోనల మధ్య అడవిలో తిరునాళ్లను పగలు చేసేవారు. క్రమేపి అడవి అంతరించిపోవడంతో తిరునాళ్లను రాత్రిళ్లు చేస్తున్నారు. భక్తులు శుక్ర, ఆదివారాలలో వందల సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారికి పొంగళ్ల నైవేద్యంగా సమర్పిస్తారు. ఏటా చైత్ర మాస బహుళ విదియ నాడు వైభవంగా తిరునాళ్లను నిర్వహిస్తున్నారు. కొండకోనల మధ్య ఉన్న ఈ ఆలయం ప్రకృతి రమణీయతకు నిలయం. ఈ దేవస్థానంలో అన్ని కులాల వారికి సత్రాలు ఉన్నాయి. ఈ సత్రాల వద్ద తిరునాళ్ల రోజు భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీ.

పశువుల పురోభివృద్ధికి ప్రదక్షిణాలు:

పశువులు, మేకలు, గొర్రెలను నీటితో శుభ్రపరుచుకొని వాటికి రంగులు పూసి, మెడలో గంటలు కట్టి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఈ ప్రాంత ప్రజల పశుపోషకులకు అలవాటు. ఇలా చేయడం ద్వారా తమ పశుసంత పురోభివృద్ధి చెందుతాయని ఇక్కడ ప్రజల నమ్మకం. తిరునాళ్లకు మూడు రోజుల ముందు నుంచి గుడి చుట్టూ తిప్పడం ఆనవాయితీగా వస్తుంది. ఏటా తిరునాళ్లను పురస్కరించుకొని గంగమ్మ తల్లికి భక్తులు విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. అలానే మండల ప్రజలు ఐకమత్యంతో కలిసి విద్యుత్ అలంకరణతో ప్రభలు ఏర్పాట్లు చేస్తున్నారు.

డ్రోన్ కెమెరాలతో పోలీసుల బందోబస్తు

తిరునాళ్ల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శి సీఐ వై.రామారావు, తాళ్లూరు ఎస్సై ఎస్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. వాహన రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి అవంతరాలు ఏర్పడకుండా 250 మంది సిబ్బందితో 3 డ్రోన్ కెమెరాలు, ఒక సీసీ కెమెరా రెండు విధాలుగా స్టాటిక్, రొటేటింగ్ టెక్నాలజీతో పనిచేసే దాదాపు 40 పైగా సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తూ పటిష్ట బందోబస్తును ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులకు అన్నదానంతో పాటు మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు సర్వీసులు

తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో ఉన్న సోమవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న గుంటి గంగమ్మ తిరునాళ్లకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకొని ఒంగోలు, పొదిలి డిపోల నుంచి ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఒంగోలు నుంచి చీమకుర్తి మీదుగా తూర్పుగంగవరం -దర్శి రోడ్డులో, అలానే దర్శి మీదుగా పొదిలి- తూర్పుగంగవరం గంగమ్మ తల్లి జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.


స్వచ్ఛమైన నీటితో కళకళలాడుతున్న దేవస్థాన సన్నిధిలో ఉన్న కోనేరు


వైఎస్సార్ సీపీ ప్రభ ఏర్పాటు కోసం జెండా పాతిన నాయకులు